## సంపాదకీయం

# ప్రమాణాలే సంక్షోభంలో పడ్డాయి

**ఈ** మధ్య కాలంలో దేశంలో అన్ని రంగాలలోనూ కల్లోలం చాలా పెరిగిందన్న భావన సాధారణ పౌరులకు కలుగుతుండవచ్చు. ఇది నిజమా లేక మీడియా విస్తృతి పెరగడం వల్ల కలుగుతున్న భ్రమా అన్న సందేహం కూడా వస్తుండవచ్చు.

మీడియా చేస్తున్న హల్‌చల్ చాలా ఉన్నప్పటికీ అన్ని రంగాలలోనూ అస్థిరత, సందిగ్ధం, సంక్షోభం పెరిగిన మాట చాలావరకు వాస్తవమే. ఒక సంక్షోభాన్ని ఆకళింపు చేసుకునే లోపల ఇంకొకటి మన ముందుంటున్నది. ఈ స్థితి రావడానికి గల కారణాలను ఎంతసేపైనా తర్కించుకో వచ్చును గానీ ఇటువంటి కల్లోలానికెప్పుడూ అసహాయులూ బలహీనులూ అయిన వారి బతుకులే బలవుతాయని గుర్తించడం అంతకంటే ముఖ్యం.

దేశ పాలనకు సంబంధించిన ప్రాథమిక ప్రమాణాలే సంక్షోభంలో పడ్డాయి. చాలా కాలం పాటు ఆచరణ ఎట్లాగున్నా ప్రమాణాలు స్థిరంగా ఉన్నాయన్న అభిప్రాయం బలంగా ఉండింది. స్వతంత్రత, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం మొదలైనవి ఈ ప్రమాణాలలో ముఖ్యమైనవి. వాటిని ఎన్నోసార్లు అతిక్రమించినప్పటికీ ఆ ప్రమాణాలకు వక్రభాష్యం చెప్పడం ద్వారా సమర్థించుకున్నారే తప్ప ప్రమాణాలను కాదని అతిక్రమించలేదు. లేదా ఆపద్ధర్మం చాటున దాక్కున్నారు.

ఇప్పుడా ప్రమాణాలను వెక్కిరించే పనులు బాహాటంగా చేస్తున్నారు. 60 సంవత్సరాల స్వాతంత్ర్యం తరువాత భారత్ బాహాటంగానే ఒక అగ్రరాజ్యానికి ఏజెంట్‌గా వ్యవహరించే పాత్రను స్వీకరించింది. ప్రపంచంలో, ప్రత్యేకించి ఆసియాలో, అమెరికాతో వ్యూహాత్మకంగా 'కలిసి నడవ డానికి' ఒప్పుకుంది. అమెరికా వ్యూహాత్మక ప్రణాళికలకు లోబడి తన విధానాలు రూపొందించు కోవడం అనే దీనికి అర్థం. ఈ మహర్దశకు ముఖ్యసూచిక భారత అమెరికా అణు ఒప్పందం. అది

ఇప్పుడిప్పుడే ఆమోదం పొందింది. అది అమలయ్యే క్రమంలో మన పాలకులు మనపైన రుద్దిన గులామీ ఏమిటో పూర్తిగా అనుభవంలోకి వస్తుంది. అందుకే ఆ ఒప్పందం స్వరూపాన్నీ పూర్వా పరాలనూ వివరించే వ్యాసం ఒకటి ఇందులో ప్రచురిస్తున్నాం.

వ్యూహాత్మక సహచర్యానికి సమాంతరం ఆర్థిక సహవాసం. అదెప్పుడో మొదలయింది. ఇప్పుడది ఎంతదూరం పోయిందంటే మన పాలకత్రయం అయిన మన్‌మోహన్ – మాంటెక్‌సింగ్ – చిదంబరంల ఇష్టానికే వదిలేసి ఉంటే ఫైనాన్స్, బ్యాంకింగ్ రంగాలలోనూ భారత ఆర్థిక వ్యవస్థను ఇప్పటికే అమెరికాతో పూర్తిగా మమేకం చేసేసి ఉందురు, ప్రస్తుతం అమెరికాను కుదిపేస్తున్న సంక్షోభాన్ని పూర్తిగా దిగుమతి చేసి ఉందురు. అదృష్టవశాత్తు రాజకీయ అస్థిరతవల్ల వారు అనేక ఒత్తిడులకు లొంగవలసి రావడం, ఆచితూచి అడుగువేయవలసి రావడం, దేశాన్ని ఆ మేరకు కాపాడింది.

సంక్షోభాలన్నీ దిగుమతి కాకపోయినా అనేక విధానాలూ, విధాన నిర్ణయాలూ దిగుమతి అయ్యాయి. వాటి గురించి విశ్లేషణాత్మకమైన, విమర్శనాత్మకమైన వ్యాసాలు మానవహక్కుల బులెటిన్‌లో మొదటి నుండి ప్రచురిస్తున్నాము. చిన్న వ్యాపారాల ప్రైవేటీకరణకూ, వ్యవసాయానికీ సంబంధించిన మరి రెండు వ్యాసాలు ఈ సంచికలో ఇస్తున్నాం.

ఆర్థిక సరళీకరణకు అవతలి ముఖం సామాజిక బాధ్యతల విస్మరణ. దేశంలోని ముస్లింలు అన్ని రంగాలలోనూ వెనుకబడి ఉన్నప్పటికీ ఇతర వెనుకబడిన వర్గాలపైన చూపిన శ్రద్ధ వారిపైన చూపడం లేదనీ, వెనుకబాటుతనం నుండి బయటకు తేవడానికి ప్రత్యేక చర్యలేవీ చేపట్టడం లేదనీ ఫిర్యాదు వచ్చిన కారణంగా కేంద్ర ప్రభుత్వమే సచార్ కమిటీని నియమించింది. ముస్లింల సామాజిక ఆర్థిక స్థితిగతులపైన రిపోర్టు ఇమ్మని కోరింది. కమిటీ ఛైర్మన్‌గా నియమించిన రాజిందర్ సచార్ ఆ కర్తవ్యానికి యోగ్యుడు. లౌకిక ప్రజాతంత్ర భావాలు గలవాడు. గతంలో పియుసిఎల్ జాతీయ అధ్యక్షుడిగా ఉండిన కారణంగా దేశంలో హక్కుల స్థితి గురించి అవగాహన ఉన్నవాడు. ఆయన రిపోర్టు కేంద్ర ప్రభుత్వానికి సమర్పించి రెండేళ్ళయింది. ముస్లిం సంస్థలు, ప్రజాతంత్ర కార్యరంగంగల సంస్థలు, 'సచార్ కమిటీ నివేదికను అమలుచేయాలి' అన్న నినాదంతో సెమినార్‌లు మీటింగ్‌లు నిర్వహిస్తూనే ఉన్నారు. కానీ దాన్ని అమలుచేయడం మొదలుపెడితే ఓటు బ్యాంకు రాజకీయాలు అంటూ బిజెపి అల్లరి చేస్తుందన్న భయంతో కాబోలు మన్‌మోహన్‌సింగ్ ప్రభుత్వం ఆ దిశగా ఒక్కడుగు కూడా వేయలేదు. ఆ రిపోర్టులో ఏముందో వివరంగా తెలియజెప్పే ప్రచురణ తీసుకు రావాలని మేమనుకుని చాలాకాలం అయింది. ఈ సంచికలోని అతి పెద్ద వ్యాసం అదే.

ఏదైనా అన్యాయానికి స్పష్టమైన కారకులొకరు ఉన్నప్పుడు వారి నడవడికను ఖండించడం, వారిపైన చర్యతీసుకోవాలని డిమాండ్ చేయడం సులభమే. నిజానికి స్పష్టంగా ఒకే ఒక్కరు కారకులైన అన్యాయం ఏదీ ఉండదుగానీ ఆచరణాత్మక విశ్లేషణార్థం కొంచెం కుదించి పరిశీ లించడం చాలా సందర్భాలలో విషయానికి నష్టమేమీ చేయదు. కానీ కొన్ని అటువంటివి కావు. అనేక ప్రభావాలకూ ఒత్తిళ్ళకూ లోనయ్యే వయసులో ఉన్న యువకులు తమను ప్రేమించడానికి నిరాకరించిన యువతిపైన హింసకు పాల్పడిన ఉదంతాలు ఈ మధ్య అనేకం జరిగాయి. తన తప్పేమీ లేకుండా ప్రాణాన్ని లేక ఆరోగ్యాన్ని లేక శారీరక ఆకృతిని లేక నిర్భీతిగా నడుచుకునే అమాయకత్వాన్ని కోల్పోయే ఆ యువతి పట్ల సానుభూతి కలగడం చాలా సహజం. ఇటువంటి

వికారమైన చర్యలు ఆగాలి అని కాంక్షించడం సహజం. కానీ దీనికి కారణం ఏమిటీ, పరిష్కారం ఏమిటీ అన్న ప్రశ్నలు వేసుకున్నప్పుడు విశ్లేషణ సరళ రేఖలో సాగదు. ఆలోచనా ధార అనేక కోణాలలో సాగుతుంది. దీనిని ప్రతిఫలించే 'ఆలోకనం' ఈ సంచికలో ప్రచురిస్తున్నాం.

విద్యుత్తు వ్యవసాయానికి ఉచితంగా ఇవ్వడం, ఇవ్వకపోవడం గురించి సంవాదం చాలా జరిగింది గానీ విద్యుత్ సరఫరా వ్యవస్థ నిర్వహణ గురించి చర్చ పెద్దగా జరగలేదు. విద్యుత్తు రైతాంగానికి ఉచితంగా ఇచ్చినప్పుడైనా ఇవ్వనప్పుడైనా, ఎలెక్ట్రిసిటీ బోర్డు ఉన్నప్పుడైనా ట్రాన్స్‌కో డిస్కాంలు వచ్చిన తరువాతైనా విద్యుత్‌రంగ నిర్వహణ గ్రామీణ జీవులను వినియోగదారులుగా చూడలేదు. వెర్రిబాగుల వాళ్ళుగా చూసింది. ఉత్పత్తిదారులుగా గౌరవించలేదు. దొంగలైనట్టు ఈసడించుకుంది. దీని ప్రత్యక్ష పరోక్ష పర్యవసానాలెన్నో. వాటిలో అత్యంత బాధాకరమైనది రైతుల కరెంటు షాకు మరణాలు. మెదక్ జిల్లాలో నిరుడు జరిగిన కరెంటు షాకు మరణాలపైన నివేదిక ఈ సంచికలో ప్రచురిస్తున్నాం.

హైదరాబాద్ నగరంలోని మక్కా మసీదులో బాంబుపేలుడు జరిగి సంవత్సరంన్నర గడిచింది. లుంబినీ పార్కు, గోకుల్ ఛాట్‌ల వద్ద బాంబుపేలుళ్ళు జరిగి సంవత్సరం మూడు నెలలు గడిచాయి. మక్కామసీదు పేలుడు పాతబస్తీ వెలుపల ఆగ్రహం కలిగించలేదు. ముస్లింలు పేల్చారు, ముస్లింలు చచ్చారు అనుకుంది నగరం. తరువాతి పేలుళ్ళు మాత్రం చాలా ఆగ్రహం రగిలించాయి. సాయంత్రం వేళ సరదాగా బయటకుపోయిన అమాయక ప్రాణాలను బలిగొన్న ఆ దుర్మార్గం పట్ల ప్రజలలో కోపం ఇంకా చల్లారకముందే పోలీసులు వరుసబెట్టి అరెస్టులు ప్రారంభించారు. ప్రతీ అరెస్టూ 'బాంబు పేలుళ్ళ పరిశోధనా క్రమంలో' జరిగినట్టే ప్రకటించారు. దుర్మార్గులను పోలీసులు పట్టేసుకుంటున్నారు అని దినపత్రికల పాఠకులు అనుకున్నారు. ఇది అవాస్తవం అని హైదరాబాద్ ప్రజలు ఇప్పటికైనా గ్రహించాలి. మా అభిప్రాయం ప్రకారమే కాదు, పోలీసుల పరిశోధన ప్రకారమే అవాస్తవం. తాము పట్టుకున్న వాళ్ళెవ్వరికీ బాంబు పేలుళ్ళతో సంబంధం ఉందని పోలీసులే అనడం లేదు. దాదాపు 100 మందిని పట్టుకున్నారు. తీవ్రంగా హింసించారు. మూడు బాంబు పేలుళ్ళతోనూ సంబంధంలేని కుట్ర కేసులలో కొందరిని, నకిలీ పాస్‌పోర్ట్ కేసులలో కొందరిని రిమాండ్ చేయించారు. ఈ మధ్య ముంబాయి పోలీసులునూ, హైదరాబాద్ పోలీసుల పరిశోధన రూటే తప్పనీ అసలు సూత్రధారులు తమకు దొరికారనీ వారు కర్నాటక, కేరళ రాష్ట్రాలకు చెందిన వారనీ ప్రకటించారు. బాధాకరమైన ఈ ప్రహసనం పైన ఒక రిపోర్టు ఈ సంచికలో ప్రచురిస్తున్నాం.

'అమర్నాథ్ భూవివాదం' సందర్భంగా కొంతకాలం క్రితం కాశ్మీరీలు కనబరచిన పట్టుదల చాలామందికి అహేతుకంగా కనిపించగా, వారి మనోభావాలపట్ల సానుభూతి గల వారికి సైతం ఆశ్చర్యం కలిగించింది. నిరంతర అణచివేత ఫలితంగా పూర్తిగా మెత్తబడిపోయారనుకున్న కాశ్మీరీలు అంత గట్టిగా ప్రతిఘటిస్తారని ఎవరూ ఊహించలేదు. అణచివేతను తిరుగులేని వజ్రాయుధంగా భావించే భారత పాలకులు అందరి కంటే ఎక్కువ ఆశ్చర్యపోయినట్టున్నారు. సంవత్సరన్నర క్రితం కాశ్మీర్‌కు వెళ్ళిన హక్కుల బృందం కాశ్మీరీలలో ఉద్విగ్నత చల్లారలేదనీ పరిస్థితులు కలిసొచ్చినప్పుడు పట్టుదలగా కొట్లాడే నైజం చావలేదనీ గమనించింది. చాలా ఏళ్ళు వారిని నిరాటంకంగా హింసించిన సర్కారీ మిలిటెంటు పాపాకిష్టవారీ పైన అతని ఊరి జనం తిరగబడ్డ వైనం ఒక ఉదాహరణ. ఆ పర్యటన రిపోర్టు ఈ సంచికలో ఇస్తున్నాం. ఇక 'అమర్నాథ్ భూవివాదం' విషయానికొస్తే, అది

వంద ఎకరాల భూమిని గురించిన వివాదం అన్న తప్పుడు అభిప్రాయంతో మొదలుపెడితే, సంకుచితమైన మతతత్వమే దానికి కారణం అన్న తప్పుడు అభిప్రాయానికి వస్తాం. కాశ్మీరీలలో తమ జాతీయతకూ దాని గుర్తింపుకూ చిహ్నాలకూ సంబంధించిన తీవ్రమైన భావోద్వేగం ఉంది. ఆ తీవ్రత ఇతరులకు అహేతుకంగానూ, అర్థరహితంగానూ తోచవచ్చును గాని, వారికి సంబంధించి నంత వరకు అదొక ప్రాథమిక వాస్తవికత. ఆ విషయాన్ని గుర్తించడానికి ఇండియా నిరాకరించి నంతకాలం మనం 'కాశ్మీర్ సమస్య' అని పిలుచుకునేది పరిష్కారం కాదు.

8వ బులెటిన్ ప్రచురించిన తరువాత అచ్చువేసిన కరపత్రాలన్నీ మా అలవాటు ప్రకారం 9వ బులెటిన్‌లో చేర్చాలి గానీ భూసేకరణ, విస్థాపనలకు సంబంధించిన వాటిని మినహాయించి మిగిలినవి మాత్రం ఈ బులెటిన్‌లో చేరుస్తున్నాం. మానవహక్కుల వేదిక ఏర్పడి 10 సంవత్సరాలు గడిచిన సందర్భంగా తీసుకొస్తున్న 10వ బులెటిన్ 'విస్థాపన'కు సంబంధించిన స్పెషల్‌గా వస్తోంది కాబట్టి ఆ విషయం పైన వేసిన కరపత్రాలు అందులో అచ్చువేస్తాము.

చివరగా, ఒరిస్సా, కర్నాటక రాష్ట్రాలలో క్రైస్తవులపైన సంఘ్ పరివార్ సంస్థల క్రూరమైన దాడుల గురించిన నివేదిక ఈ బులెటిన్‌లో లేకపోవడం ఆశ్చర్యం కలిగించవచ్చు. ఆ దాడుల గురించి, వాటి పూర్వాపరాల గురించి వివరమైన ప్రచురణ విడిగా తీసుకొస్తున్నాము కాబట్టి ఈ సంచికలో రిపోర్టు వేయడం లేదు. అయితే భారతదేశంలో ప్రజాస్వామ్యానికి అవరోధాలూ శత్రువులూ చాలా ఉన్నప్పటికీ ఒక వ్యవస్థిత కార్యాచరణ రూపంలో ఉన్న ప్రధాన శత్రువు ఆర్ఎస్ఎస్, దాని పరివారం అని మేము గతంలో ఒకటికి రెండుసార్లు వ్యక్తం చేసిన అభిప్రాయాన్ని ఈ సందర్భంగా పునరుద్ఘాటించకుండా ఉండలేం.

**–మానవహక్కుల వేదిక**

1.12.2008

❖ ❖ ❖